# తెలంగాణ వెన్నెల వాక్కు

TGTEL/25/A0871

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU








హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :30 | 13-08- 2026 | గురువారం | పేజీలు: 4 | వెల:03/-


# మిల్లర్ల బకాయిలు వసూలు చేయాల్సిందే

## ఎగవేతలకు పాల్పడితే కఠిన చర్యలు.. ధాన్యం నిల్వలకు సైలో బ్యాగులపై దృష్టి



హైదరాబాద్, ఆగస్టు 12: మిల్లర్లు బకాయిపడిన ధాన్యం విలువకు సంబంధించిన మొత్తాన్ని పూర్తిగా వసూలు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నిర్వహించే వారికి ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని, ఉద్దేశపూర్వకంగా బకాయిల ఎగవేతకు ప్రయత్నించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. పౌరసరఫరాల శాఖపై మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు.
గతంలో పేరుకుపోయిన బకాయిల వసూళ్లలో కొంత పురోగతి సాధించినప్పటికీ, ప్రతి ధాన్యం గింజకు సంబంధించిన బకాయినీ వసూలు చేయాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. బకాయిల వసూళ్లకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలను రూపొందించి, అనంతరం నివేదికను మంత్రివర్గ ఉపసంఘానికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఉపసంఘం పరిశీలన అనంతరం ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

మొండి బకాయిదారులుగా మారిన మిల్లర్లకు భవిష్యత్తులో ధాన్యం కేటాయింపుల విషయంలో ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని సీఎం సూచించారు. 2

# భారత ఆర్మీ నియామకాల్లో తెలంగాణ యువతకు ప్రోత్సాహం

## సైనిక అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక భేటీ



హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలోని యువతకు భారత సాయుధ దళాల్లో విస్తృత ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మరో వినూత్న అడుగు వేసింది. భారత ఆర్మీ చేపట్టే వివిధ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలలో తెలంగాణకు చెందిన యువత భాగస్వామ్యాన్ని పెంచేందుకు, వారిని సరైన రీతిలో ప్రోత్సహించేందుకు ఆర్మీ యంత్రాంగంతో కలిసి పనిచేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి 2

# ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లుపై రగడ.. జేపీసీకి పంపింపు

## విపక్షాల నిరసనల మధ్య 31 మంది సభ్యుల కమిటీకి అప్పగింత.. రిజిజు సవాల్



3

# గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించాలి

## ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ నుంచి సాధ్యమైనంత మేర ఎత్తిపోతలు చేపట్టాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 12: రాష్ట్రానికి అందుబాటులో ఉన్న గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు నీటిని ఎత్తిపోసి ఆయకట్టుకు అందించాలని సూచించారు. నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

దేవాదుల ఎత్తిపోతల పథకం నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో నీటిని ఎత్తిపోస్తున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశంలో వివరించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి చిన్నచిన్న సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటిని వృథా కాకుండా అవసరమైన ప్రాంతాలకు తరలించేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.

పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్దిపాటి వ్యవసాయ భూములకు సంబంధించి పరిహారం చెల్లింపులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ పెండింగ్ పరిహారాలను త్వరగా చెల్లించేందుకు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు 2

# రీల్స్ కాదు.. జీవిత పాఠాలు చదవండి

## యువత ఆత్మకథలు చదవాలి.. షార్ట్‌కట్‌లకు దూరంగా ఉండాలి: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఆగస్టు 12: సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, షార్ట్ వీడియోల ప్రభావానికి లోనుకాకుండా యువత మంచి పుస్తకాలు, మహనీయుల ఆత్మకథలు చదివి జీవితానికి అవసరమైన స్ఫూర్తిని పొందాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. జీవితంలో సులభమైన మార్గాల కోసం వెతకడం వల్ల శాశ్వత విజయం సాధించలేమని, కష్టపడి పనిచేయడం, ఓర్పుతో ముందుకు సాగడం ద్వారానే నిజమైన విజయాన్ని అందుకోవచ్చని అన్నారు.

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ రచించిన 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆత్మకథను బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన కోవింద్ జీవిత ప్రయాణాన్ని యువతకు స్ఫూర్తిదాయకంగా అభివర్ణించారు. సాధారణ కుటుంబం నుంచి అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎదిగిన కోవింద్ జీవితం అనేక పాఠాలను అందిస్తుందని పేర్కొన్నారు.

ప్రస్తుతం యువత రీల్స్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావం ఎక్కువగా ఉన్న కాలంలో జీవిస్తోందని మోదీ అన్నారు. తక్కువ సమయంలో పేరు, గుర్తింపు, విజయం సాధించాలనే ఆలోచనకు లోనుకావద్దని సూచించారు. రైల్వే స్టేషన్లలో కనిపించే 'షార్ట్‌కట్ మీ ప్రయాణాన్ని ప్రమాదంలో పడేస్తుంది' అనే భావన జీవితానికీ వర్తిస్తుందని పేర్కొన్నారు. షార్ట్‌కట్‌ల ద్వారా కాకుండా అనుభవం, శ్రమ, పట్టుదలతో ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు.

ఆత్మకథలు చదవడం ద్వారా ఒక వ్యక్తి జీవితంలో ఎదుర్కొన్న 3

# బీసీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు

## ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మందికి వంద శాతం రాయితీతో పంపిణీ




హైదరాబాద్, ఆగస్టు 12: బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఉచిత ఆటోమేటిక్ కుట్టుమిషన్ల పంపిణీకి చర్యలు చేపట్టింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో వెయ్యి మంది బీసీ మహిళలను ఎంపిక చేసి వంద శాతం రాయితీతో ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

బీసీ మహిళలు తమకు ఉన్న కుట్టుపని నైపుణ్యాన్ని ఉపయోగించుకుని సొంతంగా ఉపాధి పొందేలా చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. సాధారణ కుట్టుమిషన్లతో పోలిస్తే ఆటోమేటిక్ యంత్రాలతో తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే అవకాశం ఉంటుందని, తద్వారా మహిళలు తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వెయ్యి మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేయడం ద్వారా పెద్ద సంఖ్యలో బీసీ మహిళలకు ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. అర్హులైన మహిళల ఎంపిక ప్రక్రియను జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

కుట్టుమిషన్ల పంపిణీతో పాటు ఆసక్తి ఉన్న మహిళలకు 3

# కుల గణన నిశ్శబ్ద నిష్క్రమణ.!

## సామాజిక న్యాయంపై రాజకీయ నాటకానికి సాంకేతిక తెరమరుగు

భారతదేశ సామాజిక, రాజకీయ వ్యవస్థలో 'కుల గణన' అనే పదం దశాబ్దాలుగా అత్యంత సున్నితమైన, ఆసక్తికరమైన అంశంగా కొనసాగుతోంది. ఏడాది క్రితం ఎంతో ఆర్భాటంగా, దేశంలో సామాజిక న్యాయ సాధనకు, సంక్షేమ ఫలాల సమపాల్ల పంపిణీకి అత్యంత కీలకమైన మైలురాయిగా నిలుస్తుందని ప్రకటి స్తూ కుల గణనకు సుముఖత తెలి పిన కేంద్ర ప్రభుత్వమే, నేడు దాని ని అత్యంత నిశ్శబ్దంగా పక్కన పెట్టాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీ యాంశంగా మారింది. నాడు కేవ లం తక్షణ రాజకీయ ప్రయోజ నాలు, ఓటు బ్యాంక్ సమీక రణలను దృష్టిలో ఉంచుకుని కుల గణనకు ఒప్పుకున్న పాలకులు, నేడు రాబోయే ఎన్నికల సమీక రణలు మరియు అగ్రవర్ణాల అసం తృప్తిని దృష్టిలో ఉంచుకుని వెనక డుగు వేశారు. అయితే, ఈ నిర్ణ యంపై ప్రభుత్వం నుంచి ఎలాం టి అధికారిక ప్రకటన గానీ, బహిరంగ వివరణ గానీ ఉండే అవకాశం ఎంతమాత్రం లేదు. సంక్లిష్టమైన సాంకేతిక పదజాలం, పరిపాలనాపరమైన క్లిష్టతల వెనుక ఈ నిర్ణయాన్ని నిశ్శబ్దంగా పాతిపెడుతూ, దేశంలో కుల గణన ప్రక్రియ యథాతథంగా జరుగుతోందనే ఒక పెద్ద భ్రమను మాత్రం సర్కారు చాలా చాకచక్యంగా కొనసాగిస్తోంది.




ఇటీవల వెలువడిన పత్రికా కథనాల ప్రకారం, దేశంలో జనాభా లెక్కలను క్రమబద్ధంగా సేకరించే బాధ్యత కలిగిన రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, వచ్చే ప్రధాన జనగణనలో కులాల వివరాల సేకరణకు సంబంధించి ఒక కీలకమైన, విపరిణామాలకు దారి తీసే మార్పును తీసుకొ చ్చింది. ముందస్తుగా నిర్దేశించిన కులాల అధికారిక జాబితా ఆధారంగా వివరాలు నమోదు చేసే 'డ్రాప్-డౌన్ ఆప్షన్ల' విధానానికి స్వస్తి చెప్పి, సమాధానం ఇచ్చే వ్యక్తి చెప్పే కులం పేరును ఉన్నది ఉన్నట్లుగా రాసుకునే 'ఓపెన్-ఎండెడ్' విధానాన్ని ఉపయోగించాలని నిర్ణయించింది. బాహ్య ప్రపంచానికి లేదా సాధారణ పౌరుడికి ఇది ఎంతో సాధారణమైనదిగా, కేవలం ఒక చిన్న సాంకేతికపరమైన నిర్ణయంగా మాత్రమే కనిపించవచ్చు. కానీ, లోతుగా విశ్లేషిస్తే ఇది కుల గణన అసలు ఆశయానికే గొడ్డలి పెట్టుగా మారి, మొత్తం ప్రక్రియను పూర్తిగా అటకెక్కించడానికి రూపొందించిన ఒక పక్కా వ్యూహమని స్పష్టమవుతుంది. ఎన్యూమరేటర్ మీ ఇంటికి వచ్చినప్పుడు ఎంచుకోవడానికి ఎటువంటి నిర్దిష్టమైన లేదా ప్రామాణికమైన కులాల జాబితా ఉండదు; మీరు చెప్పిన కులం, ఉపకులం, లేదా ఇంటి పేరును వారు ఎలా చెబితే అలా నమోదు చేసుకుంటూ పోతారు.

ఈ చిన్న సాంకేతిక నిర్ణయం కుల గణన ఆశయానికి ఎలా మరణ శాసనం రాస్తుందో అర్థం చేసుకోవడానికి 2011 నాటి యుపిఏ ప్రభుత్వ అనుభవాలను ఒకసారి సుదీర్ఘంగా గమనించాల్సి ఉంటుంది. నాటి పార్లమెంట్ చర్చల్లో శరద్ యాదవ్ వంటి సీనియర్ నాయకులు కుల గణనకు అనుకూలంగా అఖిలపక్ష ఆమోదం తెచ్చినప్పటికీ, దాన్ని క్షేత్రస్థాయిలో ఎలా నమోదు చేయాలనే అంశంపై చట్టసభల్లో స్పష్టమైన అవగాహన లేకపోవడాన్ని నాటి అధికార యంత్రాంగం తమకు అనుకూలంగా మలుచుకుంది. సాధారణ జనగణన నుంచి కులాల సేకరణను వేరు చేసి, సామాజిక-ఆర్థిక కుల గణన పేరుతో ప్రత్యేక సర్వేను డిజైన్ చేసి ఈ 'ఓపెన్-ఎండెడ్' విధానాన్ని అమలు చేశారు. ప్రయాసపడి చేపట్టిన ఆ సర్వే వల్ల దేశంలో ఏకంగా 47 లక్షలకు పైగా కులాలు, ఉపకులాల పేర్లు నమోదయ్యాయి. ఫలితంగా ఆ భారీ, అనలైజ్ చేయలేని డేటాను శాస్త్రీయంగా వర్గీకరించడం, విశ్లేషించడం అసాధ్యమనే నెపంతో నివేదికల ప్రచురణను ఏళ్ల తరబడి కాలయాపన చేస్తూ చివరకు శాశ్వతంగా పక్కన పెట్టేశారు.

ఇప్పుడు కూడా సరిగ్గా అదే నాటకం పునరావృతమవుతోంది. ఈసారి ప్రత్యేక సర్వే కాకుండా, ఏకంగా అధికారిక జనగణనలోనే ఈ లోపభూయిష్టమైన విధానాన్ని రుద్దడం ద్వారా కుల గణన కచ్చితంగా విఫలమయ్యేలా అధికారులు వ్యూహరచన చేశారు. అయితే, వేలాది కులాలు, ఉపకులాలు ఉన్న భారతదేశంలో ప్రత్యామ్నాయ సరైన విధానం లేదా అంటే ఖచ్చితంగా ఉందనే చెప్పాలి. ఇటీవల బీహార్ , తెలంగాణ రాష్ట్రాల్లో నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వేలలో అత్యంత విజయవంతమైన విధానాన్ని వాడారు. ప్రతి ఒక్కరినీ నేరుగా వారి కులం పేరు అడిగే బదులు, మొదట వారి ప్రధాన సామాజిక వర్గాన్ని అడిగి, ఆపై ఆ వర్గానికి ఉన్న అధికారిక డ్రాప్-డౌన్ జాబితా నుంచి ఎంచుకోమని అడగడం అత్యంత శాస్త్రీయమైన పద్ధతి.

భారతదేశ జనాభాలో దాదాపు ముప్పావు వంతు ఉన్న రాజ, గా, రాదీజల సమగ్ర అధికారిక జాబితాలు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద సిద్ధంగా ఉన్నాయి. ఎన్యూమరేటర్ దళిత, గిరిజన లేదా వెనుకబడిన వర్గాల ఇళ్లకు వెళ్లినప్పుడు ఆయా జాబితాల ద్వారా సులభంగా నమోదు చేయవచ్చు. మిగిలిన "జనరల్" కేటగిరీకి కూడా గతంలో ఉన్న డేటా ఆధారంగా జాబితాను రూపొందించడం పెద్ద కష్టమేమీ కాదు. కాబట్టి, ఇక్కడ సమస్య సాంకేతికమైనది ఎంతమాత్రమూ కాదు, కేవలం రాజకీయ నిశ్చయత్వానికి, చిత్తశుద్ధికి సంబంధించినది.

2011లో అధికారులు ఈ నిర్ణయాన్ని దారిమళ్లించగా, ఈసారి ఇది స్పష్టంగా ప్రభుత్వ రాజకీయ వ్యూహంతో చేసిన పనిగా కనిపిస్తోంది. ప్రతిపక్షాల డిమాండ్ ను ఒప్పుకున్నట్లు నటిస్తూనే, సాంకేతిక లోపాలతో డేటా చెల్లాచెదరయ్యేలా చేసి, చివరకు ఏమీ తేలకుండా చేయడమే పాలకుల అసలు ఉద్దేశం. విద్యార్థుల నిరసనలు, యువత ఆగ్రహం, ముఖ్యంగా ఓబీసీ ఓటు బ్యాంక్ జారిపోతుందనే భయంతో పాటు, తమ సాంప్రదాయ అగ్రవర్ణ ఓటు బ్యాంక్‌ను దెబ్బతినకుండా కాపాడుకునేందుకే ప్రభుత్వం ఈ ఉపాయాన్ని ఎంచుకుంది.

అంతిమంగా,ఈ రాజకీయ వ్యూహం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. రేపు ఫలితాలు రానప్పుడు, మేము ప్రయత్నించాం కానీ స్పష్టమైన డేటా రాలేదని ఓబీసీ వర్గాలకు సమాధానం చెప్పవచ్చు. అదే సమయంలో, మీ ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా పరిస్థితిని సర్దుబాటు చేశామని అగ్రవర్ణాలకు సంకేతాలు ఇవ్వవచ్చు. మొత్తానికి, సామాజిక న్యాయం అందించాల్సిన కుల గణన ను 'పాము చావకుండా, కర్ర విరగకుండా' మరేమీ తేలకుండా నిశ్శబ్దంగా ముగించేందుకు ప్రభుత్వం ఒక తెలివైన వ్యూహాన్ని అమలు చేస్తోంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ 9848559963

# మిల్లర్ల బకాయిలు వసూలు చేయాల్సిందే

అవసరమైతే వారికి కేటాయించే ధాన్యాన్ని మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించి, మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని చెప్పారు.

మరోవైపు ప్రతి ధాన్యం సీజన్‌లో నిల్వల సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ముందస్తు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భారీగా ధాన్యం వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగుల ఏర్పాటును పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు.

స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో సైలో బ్యాగ్ నిర్మాణాలకు నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణాలకు సంబంధించి రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

వర్షాకాలంలో ధాన్యం నిల్వకు ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే ప్రత్యామ్నాయ నిల్వ కేంద్రాలను గుర్తించాలని సీఎం ఆదేశించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర ఖాళీ షెడ్లను ముందుగానే గుర్తించి అవసరమైతే లీజుకు తీసుకుని ధాన్యం నిల్వకు వినియోగించాలని సూచించారు.

వీబీజీ రామ్‌జీ పథకంలో ప్లాట్‌ఫారాల నిర్మాణానికి అవకాశం ఉన్నందున విశాలమైన ప్లాట్‌ఫారాలను ఏర్పాటు చేసి, జర్మన్ టెంట్ల ద్వారా ధాన్యం నిల్వ చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణ, నిల్వ, మిల్లింగ్ ప్రక్రియలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం ద్వారా రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.

# భారత ఆర్మీ నియామకాల్లో తెలంగాణ యువతకు ప్రోత్సాహం

పెవిలియన్‌లో భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ గారు పలువురు ఉన్నతాధికారుల బృందంతో కలిసి ముఖ్యమంత్రి గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు కూడా పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

భారత ఆర్మీ నియామకాల్లో స్థానిక తెలంగాణ యువతకు భారీ స్థాయిలో అవకాశాలు లభించేలా చూడాలన్నది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి తెలిపారు. అందుకోసం ఆర్మీ ఉద్యోగాలపై ఆసక్తి ఉన్న యువకులను ఎంపిక చేసి, వారికి అనువైన జిల్లా కేంద్రాలలో ముందస్తుగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని ఈ సందర్భంగా ఆర్మీ అధికారులను సీఎం కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ గారు సంపూర్ణ సుముఖత వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలకు తెలంగాణ యువతను సిద్ధం చేసేందుకు వీలుగా, రాష్ట్రంలోని ముఖ్యమైన జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని సైనికధిపతి హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం ద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఆర్మీలో చేరి దేశసేవ చేసేందుకు గొప్ప అవకాశం లభించనుంది.

దేశంలో ఎక్కడైనా ఊహించని ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో భారత సైన్యం అందిస్తున్న విశేష సేవలను, ప్రాణ రక్షణ చర్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా అభినందించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద ప్రభావిత పరిస్థితులు ఏర్పడినప్పుడు రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించడం, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం మరియు పునరావాస చర్యలు చేపట్టడంలో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనికి స్పందించిన రాజేష్ పుష్కర్ గారు, తెలంగాణలో అత్యవసర విపత్తు పరిస్థితులు ఎదురైనప్పుడు తక్షణమే స్పందించి ప్రత్యేక చొరవ తీసుకునేలా స్థానిక ఆర్మీ అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేస్తానని స్పష్టం చేశారు.

ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై ఆర్మీ అధికారులు ప్రశంసలు కురిపించారు. నగరంలో కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా చారిత్రక హైదరాబాద్ నగరానికి పూర్వవైభవాన్ని తేవాలన్న బలమైన పట్టుదలతో మూసీ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తుండటంపై లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ పుష్కర్ ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు. భావితరాల కోసం హైదరాబాద్ నగరాన్ని రక్షించుకోవడానికి మూసీ నది ప్రక్షాళన అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్‌ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ ఎన్. శ్రీనివాస్ రావు గారితో పాటు ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భక్తి ఉంటే సరిపోతుందా..?

## భక్తితో పాటు బాధ్యత కూడా ఉండాలి!

దేవుడిని నమ్మడం మాత్రమే కాదు..
ధర్మాన్ని జీవించడం కూడా
ఆధ్యాత్మికతేమనిషి జీవితంలో భక్తికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. కష్టాలు వచ్చినప్పుడు దేవుడిని తలుచుకోవడం, సంతోషం కలిగినప్పుడు కృతజ్ఞతలు చెప్పుకోవడం, పండుగలు, పర్వదినాల్లో ఆలయాలకు వెళ్లడం మన సంప్రదాయంలో భాగం. అయితే ఒక ప్రశ్న మాత్రం మనల్ని మనం అడగాల్సిన సమయం వచ్చింది. మనకు భక్తి ఉంది.. కానీ ఆ భక్తి మన బాధ్యతల్లో ఎంతవరకు కనిపిస్తోంది?

దేవుడిని నమ్మడం చాలా సులభం. దేవుడి ముందు నిలబడి మన కోరికలు చెప్పడం కూడా సులభమే. కానీ మనకు అప్పగించిన బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించడం, ఎదుటివారికి అన్యాయం చేయకుండా ఉండటం, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం, తల్లిదండ్రులను గౌరవించడం, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం మాత్రం అంత సులభం కాదు. నిజమైన భక్తికి పరీక్ష అక్కడే మొదలవుతుంది.భారతీయ ధార్మిక సంప్రదాయంలో భక్తి, ధర్మం, కర్మ ఒకదానితో ఒకటి విడదీయలేనివిగా కనిపిస్తాయి. భగవద్గీతలో కూడా మనిషి తన కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అంటే దేవుడిని ప్రార్థించడం మాత్రమే కాకుండా, మన చేతిలో ఉన్న పనిని సక్రమంగా చేయడం కూడా ఆధ్యాత్మిక జీవనంలో భాగమే.ఈ విషయాన్ని నేటి సమాజంతో అనుసంధానించుకుంటే మరింత స్పష్టంగా అర్థమవుతుంది. ఒక ఉద్యోగి తన విధిని సక్రమంగా నిర్వర్తించకుండా ప్రతిరోజూ పూజలు చేసినా, ఒక వ్యాపారి వినియోగదారుడిని మోసం చేస్తూ దేవుడికి పెద్ద మొత్తంలో కానుకలు సమర్పించినా, ఒక వ్యక్తి ఇంట్లో పెద్దలను నిర్లక్ష్యం చేస్తూ ఆలయంలో గంటల తరబడి గడిపినా.. అక్కడ భక్తి ఉంది కానీ భక్తి వెనుక ఉన్న ధర్మం కనిపించడం లేదు.

దేవుడికి సమర్పించే పూల కంటే మన ప్రవర్తనలో వికసించే మంచితనం గొప్పది.నేటి కాలంలో భక్తి కూడా కొంతవరకు ప్రదర్శనగా మారుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. పూజలు, యాత్రలు, దానధర్మాలు చేస్తూ వాటిని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకోవడం సాధారణమైంది. ప్రచారం తప్పు అని చెప్పలేం. కానీ ఆధ్యాత్మికతకు ప్రచారం కంటే ప్రయోజనం ముఖ్యం. మనం చేసే పూజ వల్ల మనలో మార్పు వస్తుందా? మన సేవ వల్ల మరొకరి జీవితంలో కొంత వెలుగు చేరుతుందా? అనే ప్రశ్నలు ముఖ్యమైనవి.

దేవాలయం కేవలం మన కోరికలు చెప్పుకునే స్థలం కాదు. మనలోని లోపాలను గుర్తించుకునే స్థలం కూడా కావాలి. గర్భగుడి ముందు తల వంచినప్పుడు మన అహంకారం కూడా కొంత తగ్గాలి. దేవుడి ముందు చేతులు జోడించినప్పుడు మనసులోని ద్వేషం కూడా కరిగిపోవాలి. ప్రసాదం స్వీకరించినప్పుడు మనకు లభించినదానిలో కొంత భాగాన్ని ఇతరులతో పంచుకోవాలనే భావన కలగాలి.ఆధ్యాత్మికత అంటే ప్రపంచాన్ని వదిలి అడవులకు వెళ్లడం కాదు. కుటుంబంలో ఉంటూనే ధర్మబద్ధంగా జీవించడం. ఉద్యోగంలో ఉంటూనే నిజాయితీగా పనిచేయడం. వ్యాపారంలో ఉంటూనే న్యాయాన్ని పాటించడం. ప్రజా జీవితంలో ఉంటే ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడం. తల్లిదండ్రులకు అవసరమైనప్పుడు అండగా నిలవడం. పిల్లలకు మంచి విలువలు నేర్పడం. ప్రకృతిని కాపాడడం. ఇవన్నీ కూడా ఆధ్యాత్మికతలో భాగమే.

ముఖ్యంగా నేటి తరానికి ఈ భావనను పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. పిల్లలను కేవలం ఆలయాలకు తీసుకెళ్లడం మాత్రమే కాకుండా, ఆలయాలు ఎందుకు నిర్మించబడ్డాయి? ధర్మం అంటే ఏమిటి? పెద్దలను ఎందుకు గౌరవించాలి? ఇతరుల పట్ల దయ ఎందుకు చూపాలి? ప్రకృతిని ఎందుకు కాపాడాలి? వంటి విషయాలను వివరించాలి. అప్పుడు మాత్రమే ఆధ్యాత్మికత తరతరాలకు అర్థవంతంగా కొనసాగుతుంది.మనిషి జీవితంలో సంపద, హోదా, పేరు ఇవన్నీ కాలంతో మారిపోవచ్చు. కానీ మనం చేసిన మంచి పనులు మాత్రం ఇతరుల జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి. అందుకే భక్తితో పాటు సేవ, పూజతో పాటు బాధ్యత, ప్రార్థనతో పాటు ఆచరణ అవసరం.దేవుడిని నమ్మడం భక్తి అయితే.. దేవుడు చూపిన ధర్మమార్గంలో నడవడం బాధ్యత.దేవుడికి నమస్కరించడం ఆచారం అయితే.. మనిషిని గౌరవించడం ఆచరణ.దేవుడిని వెతకడం ఆధ్యాత్మికత అయితే.. మనలోని మంచితనాన్ని మేల్కొలపడం దాని పరమార్థం.చివరికి మన భక్తిని దేవుడు ఎంతగా స్వీకరించాడన్నది కంటే, మన భక్తి వల్ల మనిషిగా మనం ఎంతగా మారామన్నదే అసలైన ప్రశ్న.



విశ్లేషణ: దేగామ యోగేష్ కుమార్
సీనియర్ జర్నలిస్ట్
తెలంగాణ వెన్నెల వాక్కు

# గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించాలి

క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు.

తక్షణ ప్రభావం పడే గ్రామాలకు ప్రాధాన్యంగా పరిహారం చెల్లించాలని సీఎం స్పష్టం చేశారు. పరిహారం, పునరావాసానికి సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీటిని నింపే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ప్రాజెక్టుల ద్వారా ఆయకట్టుకు నీటిని అందించేందుకు అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యాన్ని పెంచే అంశంపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో మరింత నీటిని ఎత్తిపోసే విధంగా సామర్థ్యం పెంపు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించి అవసరమైన అధ్యయనాలను ప్రారంభించాలని సూచించారు.

మరోవైపు సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల విషయంలో జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనలను తప్పనిసరిగా పాటించాలని సీఎం స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ఆయా బ్యారేజీల్లో నీటి నిల్వకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ పలు లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి సమావేశంలో వివరించారు.

బ్యారేజీల భద్రత విషయంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా ఎన్‌డీఎస్‌ఏతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రాజెక్టుల భద్రత, నీటి లభ్యత, ఎత్తిపోతల సామర్థ్యం, ఆయకట్టుకు నీటి సరఫరా వంటి అంశాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు.

# బీడీ కార్మికులందరికీ చేయూత పింఛన్లు మంజూరు చేయాలి: సీఐటీయూ

## – కలెక్టరేట్ ఎదుట బీడీ కార్మికుల భారీ ధర్నా, ర్యాలీ.. కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందజేత



నిర్మల్, ఆగస్టు 12 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుండి నూతనంగా ప్రారంభించనున్న 'చేయూత' ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియలో బీడీ కార్మికులకు అవకాశం కల్పించి, అర్హులైన ప్రతి కార్మికురాలికి పింఛన్ మంజూరు చేయాలని సీఐటీయూ నిర్మల్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వందలాది మంది బీడీ కార్మికులు నిర్మల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీగా వెళ్లి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు (ఏఓ) వినతిపత్రం సమర్పించారు.

**లక్షన్నర మంది బీడీ కార్మికులను విస్మరించడం విచారకరం:**
ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విడుదల చేసిన నూతన పింఛన్ల మార్గదర్శకాల్లో బీడీ కార్మికుల ప్రస్తావన లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. నిర్మల్ జిల్లాలో బీడీ పరిశ్రమపై ఆధారపడి లక్షన్నర మందికి పైగా కార్మికులు జీవిస్తున్నారని, కానీ ప్రస్తుతం కేవలం 61,933 మందికి మాత్రమే పింఛన్లు అందుతున్నాయని తెలిపారు. మిగిలిన కార్మికులను పథకానికి దూరం చేయడం అన్యాయమన్నారు.

**పింఛన్ 4,016 రూపాయలకు పెంచి అమలు చేయాలి:**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులకు నెలకు 4,016 రూపాయల పింఛన్ సదుపాయాన్ని తక్షణమే అమలు చేయాలని సురేష్ విజ్ఞప్తి చేశారు. ఒకే ఇంట్లో ఇద్దరు కార్మికులు ఉంటే ఒక్కరికే ఇవ్వడం, కటాఫ్ తేదీల పేరుతో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. ఆంక్షలు లేకుండా అర్హత ఉన్న ప్రతి బీడీ కార్మికురాలికి జీవన భృతి అందజేయాలని స్పష్టం చేశారు.

**ఉపాధి లేక తీవ్ర ఇబ్బందుల్లో కార్మిక కుటుంబాలు:**
తెలంగాణ బీడీ అండ్ సీగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి. గంగామణి మాట్లాడుతూ.. కంపెనీల దోపిడీ, పనిదినాల కోతతో బీడీ పరిశ్రమ రోజురోజుకూ కుదేలవుతోందన్నారు. వారంలో కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే యాజమాన్యాలు పని ఇస్తుండటంతో చాలీచాలని కూలీతో కుటుంబాలను పోషించుకోవడం గగనంగా మారిందన్నారు. ప్రభుత్వం ప్రతినెలా కనీసం 26 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు.

**రిటైర్మెంట్ పింఛన్ 6 వేల రూపాయలు చెల్లించాలి:**
రిటైర్మెంట్ పొందిన వయోవృద్ధ బీడీ కార్మికులకు నెలకు 6,000 రూపాయల పింఛన్ మంజూరు చేయాలని నాయకులు కోరారు. అలాగే టేకేదార్లు వేయి బీడీలకు ఐదు కట్టలు, కార్డుకు 1500 బీడీలు కట్ చేయడాన్ని అరికట్టాలని, వెయ్యి బీడీలకు 268 రూపాయల వేతనం కచ్చితంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆంక్షలు తొలగించకపోతే భవిష్యత్తులో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు

ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు క్లైమెంట్ వెస్లీ, రియాంత్, బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మల్లీశ్వరి, అనూష, ఆసియా బాను, పావని, సరిన్, ఉమేరా మరియు జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుండి విచ్చేసిన బీడీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తరోడా గ్రామంలో ఉచిత న్యాయ సాయంపై అవగాహన సదస్సు



ముధోల్, ఆగస్టు 12 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండలం తరోడా గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో భైంసా న్యాయస్థానం జూనియర్ సివిల్ జడ్జి ఆర్.కె. వెంకట రమణ సుహాస్ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. గ్రామంలోని రైతులు, ప్రజలకు పౌర హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా జడ్జి వెంకటరమణ సుహాస్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు తమకు రాజ్యాంగం కల్పించిన చట్టపరమైన హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్థిక సమస్యల కారణంగా ఏ ఒక్క నిరుపేద కూడా న్యాయానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచిత న్యాయ సేవాధికార సంస్థల ద్వారా సేవలు అందిస్తోందన్నారు.న్యాయపరమైన చిక్కులు, భూ వివాదాలు ఎదురైనప్పుడు చట్టబద్ధమైన మార్గాల ద్వారా న్యాయస్థానాలను ఆశ్రయించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న జడ్జి ఉచిత న్యాయ సహాయాన్ని ఎలా వినియోగించుకోవాలో వివరంగా బోధించారు.అనంతరం గ్రామానికి విచ్చేసి అవగాహన కల్పించిన జడ్జి వెంకటరమణ సుహాస్‌ను తరోడా సర్పంచ్ అరిఫోద్దీన్ శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సై బిట్ల పెర్సిస్, ఉప సర్పంచ్ హన్మాంత్ రావు, పంచాయతీ కార్యదర్శి అమిత, రైతులు పాల్గొన్నారు.

# ఆగస్టు 13 నుండి ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే ఎరువుల విక్రయం

దిలావర్‌పూర్, ఆగస్టు 12 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రైతులకు ఎరువుల విక్రయం పారదర్శకంగా, అవసరాలకు తగినట్లుగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్' (ఎఫ్ఎఫ్ఎస్) నూతన డిజిటల్ విధానం గురువారం (ఆగస్టు 13) నుండి అమలులోకి వస్తుందని దిలావర్‌పూర్ మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు.
ఇకపై రైతులు తమ మొబైల్ ఫోన్లలో గూగుల్ ప్లే స్టోర్ నుండి ఎఫ్ఎఫ్ఎస్ (ఖీఖీ) యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. భూమి వివరాలు, సాగు చేసే పంటల ఆధారంగా యాప్‌లోనే అవసరమైన ఎరువులను ముందుగా బుక్ చేసుకోవచ్చన్నారు.
బుకింగ్ పూర్తయిన తర్వాత యాప్‌లో క్యూఆర్ (ఝ=) కోడ్ మరియు టోకెన్ నంబర్ వస్తాయని, దాని ఆధారంగా ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద సులభంగా ఎరువులు పొందవచ్చని వివరించారు. ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఈ డిజిటల్ విధానం ఎంతగానో దోహదపడుతుందన్నారు.
దిలావర్‌పూర్ మండల రైతులు ముందస్తుగా యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఉంటే ఏఈఓలను సంప్రదించాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.

# విశ్వబ్రాహ్మణ కర్ర పారిశ్రామిక సంఘ భవన అభివృద్ధికి సహకరిస్తాం: అప్పాల గణేష్



నిర్మల్, ఆగస్టు 12 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణ విశ్వబ్రాహ్మణ కర్ర పారిశ్రామిక సంఘం భవన సమగ్ర అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ తరపున తగిన సహకారం అందజేస్తామని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి హామీ ఇచ్చారు. బుధవారం నిర్వహించిన సంఘ ముఖ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు తమ సంఘ భవనానికి కావలసిన మౌలిక సదుపాయాలు, నిధుల కేటాయింపు కొరకు వైస్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘ సభ్యుల సమస్యలను విన్న ఆయన మున్సిపల్ కౌన్సిల్‌లో చర్చించి అవసరమైన సహాయం అందిస్తానన్నారు.
అనంతరం విశ్వబ్రాహ్మణ కర్ర పారిశ్రామిక సంఘం ప్రతినిధులు వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తితో పాటు నాయకులు అప్పాల ప్రభాకర్, కౌన్సిలర్లు కత్తి నరేందర్, పెండం శ్రీనివాస్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సమావేశంలో కర్ర పారిశ్రామిక సంఘం జిల్లా, పట్టణ ప్రతినిధులు, నిర్వాహకులు మరియు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రీల్స్ కాదు.. జీవిత పాఠాలు చదవండి

కష్టాలు, సాధించిన విజయాలు, తీసుకున్న నిర్ణయాలు, ఎదురైన సవాళ్లను దగ్గరగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని ప్రధాని తెలిపారు. చరిత్రను కేవలం పుస్తకాల్లో చదవడం కంటే, ఆ కాలాన్ని స్వయంగా అనుభవించిన వ్యక్తుల జీవితాల ద్వారా తెలుసుకోవడం మరింత ప్రభావవంతంగా ఉంటుందని చెప్పారు. యువత తమకు స్ఫూర్తినిచ్చే నాయకులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు, క్రీడాకారులు తదితరుల జీవిత చరిత్రలను చదవాలని సూచించారు.
రామ్‌నాథ్ కోవింద్ దేశానికి అందించిన సేవలను మోదీ ప్రశంసించారు. రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన తర్వాత కూడా దేశానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలపై ఆయన సేవలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా 'వన్ నేషన్––వన్ ఎలక్షన్' అంశంపై పనిచేసిన కోవింద్ కమిటీ పాత్రను ప్రస్తావించారు. కోవింద్ జీవితంలో కనిపించే నిరాడంబరత, కష్టాలను అధిగమించి ఉన్నత స్థాయికి ఎదిగిన తీరు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు.

# ఎఫ్‌సీఆర్ఏ బిల్లుపై రగడ.. జేపీసీకి పంపింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 12: విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు––2026పై పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బిల్లును మైనారిటీలు, స్వచ్ఛంద సంస్థలను లక్ష్యంగా చేసుకునేలా రూపొందించారని విపక్షాలు ఆరోపించగా.. విదేశీ నిధుల విషయంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే తమ ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బిల్లును మరింత లోతుగా పరిశీలించేందుకు ల31 మంది సభ్యులతో కూడిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)లికి పంపే తీర్మానాన్ని లోక్‌సభ బుధవారం ఆమోదించింది. బిల్లుపై చర్చ సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు విపక్షాల ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ బిల్లులో మైనారిటీలు లేదా ఏదైనా ప్రత్యేక వర్గానికి వ్యతిరేకంగా ఉన్న నిబంధన ఏదైనా ఉంటే చూపించాలని విపక్షాలను సవాల్ చేశారు. విదేశీ విరాళాల వ్యవహారంలో స్పష్టమైన నియంత్రణలు, పారదర్శకత అవసరమని పేర్కొన్నారు. విదేశాల నుంచి వచ్చే నిధులు దుర్వినియోగం కాకుండా చూడటం, అక్రమంగా నిధులు మళ్లించకుండా నిరోధించడమే చట్ట సవరణ ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది.మరోవైపు కాంగ్రెస్ సహా విపక్షాలు బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాయి. మైనారిటీ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలపై ప్రభుత్వం మరింత నియంత్రణ సాధించేందుకు ఈ సవరణలను తీసుకొస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు సభలో నిరసనకు దిగారు. నినాదాలతో సభలో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.
విపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో బిల్లును విస్తృతంగా పరిశీలించేందుకు జేపీసీకి పంపాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. వాయిస్ ఓటుతో తీర్మానం ఆమోదం పొందింది. జేపీసీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉంటారు. కమిటీ బిల్లులోని ప్రతిపాదిత నిబంధనలను పరిశీలించడంతో పాటు సంబంధిత వర్గాలు, నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోనుంది.విదేశీ నిధులు స్వీకరించే సంస్థలకు ఎఫ్‌సీఆర్ఏ నిబంధనలు కీలకమైనవి కావడంతో తాజా సవరణలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విదేశీ విరాళాల వినియోగంలో పారదర్శకత, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడం అవసరమని ప్రభుత్వం చెబుతుండగా.. ప్రతిపాదిత నిబంధనలు ప్రభుత్వానికి అధిక అధికారాలను కల్పించే అవకాశం ఉందని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# ఉపాధ్యాయుల పిఆర్‌సీ, డీఏ బకాయిలు తక్షణమే చెల్లించాలి: యూఎస్‌పీసీ



దిలావర్‌పూర్, ఆగస్టు 12 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఉపాధ్యాయులు ఎదుర్కొం టున్న న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు యునైటె ాడ్ సర్వీస్ పెన్షనర్స్ అండ్ టీచర్స్ కౌన్సిల్ (యూఎస్ పీసీ) రెండవ దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా దిలావర్‌పూర్ తాహసీల్దార్‌కు బుధవారం ప్రత్యేక మెమోరాండం సమర్పించారు.
ఈ సందర్భంగా ఉపాధ్యా య సంఘాల నాయకులు మాట్లాడుతూ.. పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రావాల్సిన నూతన పిఆర్‌సీ (ౄ=జ) ని తక్షణమే ప్రకటించాలని, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏ (ణూ) బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.
ఉద్యోగులు, ఉపాధ్యాయుల కొరకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) నిబంధనలను సవరించి పూర్తిస్థాయిలో ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర శాఖ పిలుపు మేరకు నిరసనను ఉధృతం చేస్తామన్నారు.
ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పి. భోజన్న, ఎస్టీయూ జిల్లా నాయకుడు సిలారీ మధు మరియు వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జటాశంకర్ ఆలయ సమస్యలు పరిష్కరించాలి: ముధోల్‌లో బీసీ సంఘం వినతి

ముధోల్, ఆగస్టు 12 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలో బీసీ సంఘం కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. శ్రావణ మాసంలో ప్రతి వారం అన్నదాన కార్యక్రమాలు చేపట్టడం మరియు జటాశంకర్ ఆలయం వద్ద మౌలిక సమస్యల పరిష్కారంపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు.అనంతరం ముధోల్ సర్పంచ్ షబానా బేగం ఏజాజుద్దీన్‌ను కలిసి ఆలయ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రి నుండి జటాశంకర్ ఆలయం వరకు ఉన్న విద్యుత్ లైన్ వైర్లు తెగిపోవడం వల్ల వీధి దీపాలు వెలగడం లేదని, తక్షణమే వైర్లు మార్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు.అలాగే ప్రధాన రహదారి నుండి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మించాలని, వర్షాకాలంలో అన్నదానానికి ఇబ్బంది లేకుండా ఆలయ ప్రాంగణంలో పకా షెడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపై స్పందించిన సర్పంచ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షుడు వరగంటి విట్టల్, ప్రతినిధులు వెంకటేష్, లక్ష్మణ్, గంగారం, నాగేష్, సాయినాథ్, బాబు, ఆనందరావు పాటిల్, పోతన్న, పండరి, మాజీ

# బీసీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు

టైలరింగ్, డిజైనింగ్ తదితర అంశాల్లో నైపుణ్య శిక్షణ అందించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. శిక్షణ పొందిన మహిళలు ఇంటి వద్ద నుంచే కుట్టుపని చేసుకుంటూ ఆదాయం పొందే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.
ఈ పథకం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆర్థికంగా వెనుకబడిన బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది. కుటుంబ ఆర్థిక పరిస్థితికి తోడ్పడటంతో పాటు మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఆదాయం సంపాదించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని ప్రభుత్వం పేర్కొంటోంది.
లబ్ధిదారుల ఎంపిక, దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను ప్రభుత్వం వెల్లడించాల్సి ఉంది. అధికారిక ప్రక్రియ ప్రారంభమైన తర్వాత అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలు తదితర వివరాలు స్పష్టంగా వెలువడనున్నాయి.




# తెలంగాణ, ఏపీ, ఒడిశా రాష్ట్రాలకు తీపికబురు.. రూ.2,170 కోట్ల రోడ్ల పనులకు కేంద్రం ఆమోదం: రాజ్యసభలో మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటన

న్యూఢిల్లీ బ్యూరో తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పొరుగున ఉన్న ఒడిశా రాష్ట్ర ప్రయాణికులకు, రవాణా రంగానికి కేంద్ర ప్రభుత్వం బిగ్ గుడ్‌న్యూస్ చెప్పింది. ఈ మూడు రాష్ట్రాల పరిధిలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, వివిధ ప్రాంతాల మధ్య అంతరాన్ని తగ్గించి కనెక్టివిటీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కీలక నిర్ణయం తీసుకుంది. రూ.2,170 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న వివిధ జాతీయ రహదారుల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణం మరియు పాత రోడ్ల ఆధునీకరణ ప్రాజెక్టులకు కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ ఆమోదం తెలిపింది. ఈ విషయాన్ని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా పార్లమెంట్ వేదికగా రాజ్యసభలో వెల్లడించారు.పార్లమెంట్ సమావేశాల సందర్భంగా రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాధానమిస్తూ ఈ వివరాలను వెల్లడించారు. దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థను ప్రపంచ స్థాయిలో తీర్చిదిద్దేందుకు నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే దక్షిణాది మరియు తూర్పు భారతదేశంలో అత్యంత కీలకమైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల పరిధిలో రవాణా అవసరాలను గుర్తించి, ఈ భారీ నిధులను మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు.ఈ ప్రాజెక్టుల ద్వారా మూడు రాష్ట్రాల మధ్య అంతర్రాష్ట్ర రవాణా మరింత వేగవంతం కానుంది. రద్దీగా ఉండే వ్యాపార మార్గాలు, తీరప్రాంతాలు, పరిశ్రమలు ఉన్న ప్రాంతాలను అనుసంధానించడం ద్వారా రవాణా వ్యయం మరియు ప్రయాణ సమయం

తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871






**తెలంగాణ వెన్నెల వాక్కు (ప్రత్యేక కథనం )**
నేరాల నియంత్రణలో నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోంది. నేరం జరిగిన తర్వాత కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడమే కాకుండా.. నేరాలు జరగకుండా ముందస్తు చర్యల కు ప్రాధాన్యత ఇవ్వడం పోలీసింగ్‌లో కీలక మార్పుగా కనిపిస్తోంది. జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల నేతృత్వంలో ఆస్తి నేరాల నియంత్రణ, కేసుల వేగవంతమైన ఛేదన, నేరస్తుల కదలికలపై నిఘా వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ప్రజలకు మరింత భద్రత కల్పించే దిశగా పోలీస్ శాఖ అడుగులు వేస్తోంది.

ఇటీవల జిల్లాలో నమోదైన ఇంటి దొంగతనాలు, ఆలయ చోరీలు, ద్విచక్ర వాహనాల చోరీలు, కాపర్ వైర్ చోరీలు తదితర ఆస్తి నేరాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి కేసును లోతుగా పరిశీలిస్తూ సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలు, గత నేర చరిత్ర తదితర అంశాలను సమన్వయం చేసుకుంటూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దీంతో కేసుల ఛేదనలో వేగం పెరగడంతో పాటు నేరస్తుల కదలికలను ముందుగానే గుర్తించే అవకాశం ఏర్పడుతోంది.

వారం రోజుల్లో 20 ఆస్తి నేరాల కేసులను ఛేదించడం, మరో 15 కేసుల్లో కీలక ఆధారాలను సేకరించడం జిల్లా పోలీసుల దర్యాప్తు వేగానికి నిదర్శనంగా నిలుస్తోంది. కేసుల ఛేదనలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి, వివిధ ప్రాంతాల్లో నమోదైన నేరాలను సమగ్రంగా విశ్లేషించడం ద్వారా నేరాల వెనుక ఉన్న వ్యక్తులు, ముఠాల కదలికలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

ఆస్తి నేరాలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు ఏర్పాటు చేసిన రెండు టాస్క్‌ఫోర్స్ బృందాలు ఈ కార్యాచరణలో కీలకంగా మారాయి. బైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయకత్వంలో ప్రత్యేక బృందాలు నిరంతరం పనిచేస్తూ వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కేసులపై దర్యాప్తు కొనసాగిస్తున్నాయి. గత నేరాలకు సంబంధించిన వివరాలను ప్రస్తుత కేసులతో అనుసంధానం చేస్తూ నేరస్తుల కదలికలను గుర్తించే విధానం కేసుల ఛేదనకు మరింత బలాన్ని చేకూరుస్తోంది.

నేరాలను అడ్డుకునే క్రమంలో జిల్లాలో 13 ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం కూడా కీలక చర్యగా నిలిచింది. బైంసా టౌన్ పరిధిలో ఐదు, నిర్మల్ టౌన్ పరిధిలో ఏడు, సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహిస్తూ నేరస్తుల కదలికలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేస్తున్నారు.

చెక్‌పోస్టుల ఏర్పాటుతోనే చర్యలు ఆగిపోకుండా వాటి పనితీరును అధికారులు ప్రతి రోజూ పర్యవేక్షించడం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం. సిబ్బంది పనితీరు, వాహన తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల పరిశీలన తదితర అంశాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించడం ద్వారా క్షేత్రస్థాయిలో పోలీసింగ్ మరింత అప్రమత్తంగా కొనసాగుతోంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలోనూ జిల్లా పోలీస్ శాఖ ముందుకు సాగుతోంది. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించడం, నిందితుల కదలికలను సాంకేతిక ఆధారాలతో విశ్లేషించడం, గత నేరాల సమాచారాన్ని అనుసంధానం చేయడం వంటి చర్యలు ఆధునిక దర్యాప్తులో కీలకంగా మారాయి. ముఖ్యంగా ఆలయాలు, వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్లు, ప్రధాన రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాల ప్రాధాన్యతను పెంచడం ద్వారా నేర నిరోధక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నారు.

బైంసా టౌన్ పరిధిలోని పోచమ్మ ఆలయంలో జరిగిన హుండీ చోరీ కేసును 48 గంటల్లోనే ఛేదించడం పోలీసుల వేగవంతమైన దర్యాప్తుకు మంచి ఉదాహరణ. సీసీ కెమెరా ఫుటేజీలను విశ్లేషించి నిందితుడిని గుర్తించడం, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టడం ద్వారా సాంకేతిక ఆధారాల వినియోగం ఎంత కీలకమో ఈ కేసు స్పష్టం చేసింది.

అదేవిధంగా కడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన ఐదు దొంగతనం కేసులను ఛేదించడం, నిర్మల్ టౌన్ పరిధిలోని మహాదేవ్‌పురం, శాస్త్రినగర్, సోఫీనగర్, గల్లేపేట్ రోడ్, బంగల్‌పేట్, దివ్యానగర్ తదితర ప్రాంతాల్లో నమోదైన చోరీ కేసులపై దర్యాప్తు కొనసాగించడం ద్వారా పోలీసులు ఆస్తి నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన విషయం స్పష్టమవుతోంది.

నిర్మల్ రూరల్, మామడ, సారంగాపూర్, లక్ష్మణచాంద, తానూర్, కడెం తదితర ప్రాంతాల్లో నమోదైన ఆలయ చోరీలు, ఇంటి దొంగతనాలు, చోరీకి యత్నించిన కేసుల్లోనూ కీలక ఆధారాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన నేరాలను విడివిడిగా కాకుండా సమగ్రంగా పరిశీలించడం ద్వారా నేరాల వెనుక ఉన్న ముఠాల కదలికలను గుర్తించే ప్రయత్నం జరుగుతోంది.

నిర్మల్ అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన చోరీతో పాటు ఇతర దేవాలయాల్లో జరిగిన చోరీలు, ఇళ్లలో జరిగిన దొంగతనాల కేసులపైనా ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ప్రజల ఆస్తులతో పాటు ఆధ్యాత్మిక ప్రదేశాల భద్రతకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. కీలక ఆధారాలు లభించిన కేసుల్లో నిందితులను అదుపులోకి తీసుకుని మరిన్ని కేసులను ఛేదించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.

మరోవైపు గంజాయి వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించడం కూడా శాంతిభద్రతల పరిరక్షణలో ముఖ్యమైన భాగం. మాదకద్రవ్యాల ప్రభావం యువతపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు.

నేర నియంత్రణలో పోలీసుల చర్యలకు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరం. ఇళ్లు, దుకాణాలు, ఆలయాలు, వ్యాపార సంస్థలు, ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ప్రజలు కూడా భద్రతా వ్యవస్థలో భాగస్వాములు కావచ్చు. విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండటం, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలను వెంటనే పోలీసులకు తెలియజేయడం ద్వారా నేరాలను అడ్డుకోవడంలో సహకరించవచ్చు.

మొత్తంగా నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ కేసుల ఛేదనతో పాటు నేరాల నివారణకు సమాన ప్రాధాన్యత ఇస్తోంది. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లు, 13 చెక్‌పోస్టులు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, సాంకేతిక ఆధారాల వినియోగం, గత నేరస్తుల కదలికలపై నిఘా వంటి చర్యలు నేర నియంత్రణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయి.

జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల నేతృత్వంలో పోలీస్ శాఖ తీసుకుంటున్న ఈ సమన్వయపూర్వక చర్యలు నేరస్తులకు గట్టి హెచ్చరికగా.. ప్రజలకు భరోసాగా నిలుస్తున్నాయి. నేరాలను అరికట్టడంలో నిరంతర అప్రమత్తత, వేగవంతమైన దర్యాప్తు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల భాగస్వామ్యం కలిసివస్తే నిర్మల్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ మరింత పటిష్టం కావడం ఖాయం.

# నిర్మల్‌లో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**నిర్మల్, ఆగస్టు 12 (తెలంగాణ వెన్నెల వాక్కు):**
ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయంలో సంఘం పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థి పోరాటాల చరిత్రను స్మరించుకున్నారు. 1936 ఆగస్టు 12న ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్, సుదీర్ఘకాలంగా దేశవ్యాప్తంగా విద్యార్థుల విద్యా, సామాజిక హక్కుల కొరకు నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తోందని నాయకులు తెలిపారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కొరకు రాబోయే రోజుల్లో జిల్లా పరిధిలో ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు సన్నిహిత్, అర్జున్, నిఖిల్, అనంతరావు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి: ఏఐటీయూసీ



**ఖానాపూర్/నిర్మల్, ఆగస్టు 12 (తెలంగాణ వెన్నెల వాక్కు):**
వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు కనీస వేతనం 26,000 రూపాయలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విలాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఖానాపూర్ జడ్జిఖానా వద్ద ఏఐటీయూసీ అనుబంధ మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ శాఖ సమావేశం జరిగింది.

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్. విలాస్ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు పునరుద్ధరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లు కార్మిక వర్గానికి వ్యతిరేకమని, వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు.

అనంతరం మెడికల్ కాంట్రాక్ట్ యూనియన్ జడ్జిఖానా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కే. శ్రీనివాస చారి, అధ్యక్షుడిగా రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూక్యా రమేష్, కార్యదర్శిగా వినోద్, కోశాధికారిగా భాగ్యలక్ష్మి ఎంపికయ్యారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.ఎన్. రెడ్డి, నాయకులు జీవన్ లక్ష్మి, సత్యవతి, రఘు, సాయికుమార్, సత్యనారాయణ, శ్యామ్సన్, బందన్న, లావణ్య, లక్ష్మి మరియు కార్మికులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా చేయూత పింఛన్లు అందాలి: కలెక్టర్

## – ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ.. ఇందిరమ్మ ఇండ్లు, వనమహోత్సవంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

**నిర్మల్, ఆగస్టు 12 (తెలంగాణ వెన్నెల వాక్కు):**
రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పింఛన్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా, వేగవంతంగా పింఛన్లు అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**ఆగస్టు 31 వరకు చేయూత దరఖాస్తుల స్వీకరణ:**
కొత్త చేయూత పింఛన్ల కోసం బుధవారం నుండి ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమం చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. స్వీకరించిన దరఖాస్తులను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రజలు గ్రామ పంచాయతీ కార్యదర్శి లేదా ఎంపీడీవో కార్యాలయంలో, పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి:**
జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎక్కడా పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే ప్రారంభించి, నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మండలాల వారీగా లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణ పురోగతిని నిరంతరం సమీక్షించి, నిర్మాణాలు వేగంగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వనమహోత్సవం, జలసిరి పనుల లక్ష్య సాధన:
వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత స్థానిక అధికారులదేనని తెలిపారు. అలాగే తెలంగాణ జలసిరి పథకం కింద ఇంకుడు గుంతలు, బోర్వెల్లు, ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను ముమ్మరంగా చేపట్టి పూర్తి చేయాలన్నారు.

**ప్లాస్టిక్ అమ్మకాలపై కఠిన చర్యలు:**
జిల్లా వ్యాప్తంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించడానికి కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలను గుర్తించి సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానాలు విధించాలన్నారు. నిర్మల్‌ను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చాలన్నారు.

ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, సుందర్ సింగ్, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు మరియు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.




# ముసేబ్ వివాహ వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ ముస్లిం సంఘం నేతలు





**నిర్మల్, ఆగస్టు 12 (తెలంగాణ వెన్నెల వాక్కు):**
నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి, మదీనా హోటల్ అబ్దుల్ రెహమాన్ కుమారుడు మహమ్మద్ అబ్దుల్ ముసేబ్ వివాహ విందు (రిసెప్షన్) వేడుకలు స్థానిక ఆర్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నిర్మల్ పట్టణ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. తెలంగాణ ముస్లిం సంఘం నేతలు పెళ్లికుమారుడికి పూలమాలలు, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ ప్రముఖులు అబ్దుల్ రెహమాన్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుక ప్రాంగణం బంధుమిత్రులు, రాజకీయ ప్రముఖుల రాకతో కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ శుభకరన్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీషణ్ అలీ, జాహెద్ అలీ, డాక్టర్ మతీన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి షేక్ ముజాహిద్ మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com